

కుర్చీ మీద ప్రేమతోనే హిందూ నినాదం

కుర్చీ మీద ప్రేమతోనే బీజేపీ హిందూ నినాదం ఎత్తుకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. - 8లో▸



ఆలయాల్లో శుద్ధి.. సంప్రోక్షణ

చంద్ర గ్రహణం ముగియడంతో సోమవారం నగరంలోని ఆలయాలను అర్చకులు శుద్ధి, సంప్రోక్షణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32^{0} /24^{0}

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేత్రదానంపై అవగాహన ఉండాలి



ఎంజీఎం : నేత్రదానం చేసి మరణానంతరం కూడా జీవించాలని, ప్రతీ ఒక్కరికి నేత్రదానంపై అవగాహన ఉండాలని కేఎంసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీపతి పేర్కొన్నారు. 40వ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం కేఎంసీ నుంచి ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాల వరకు నిర్వహించిన ర్యాలీని లక్ష్మీపతి జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.ఆర్ భరత్‌కుమార్, శ్రీకుమార్, హరిదేవ్, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీ డాక్టర్లు, ఆప్టోమెట్రి, బీఎస్సీ, జీఎన్ఎం నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ క్రైం: ఈనెల 13న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ఆస్తి, కుటుంబ, వైవాహిక జీవిత, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్, తదితర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టు చుట్టూ తిరుగుతూ విలువైన సమయం, డబ్బులను వృథా చేసుకోవద్దని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీపడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ చేసి రాజీపడేలా అవగాహన కల్పిస్తారని వివరించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని, రాజీపడదగే వారు పోలీస్ అధికారులను సంప్రదించాలని కోరారు.

తరగతి గదిలో టీఎల్‌ఎంలు వినియోగించాలి

హనుమకొండ డీఈఓ వాసంతి



విద్యారణ్యపురి : తరగతిగదిలో విద్యార్థులకు బోధించేటప్పుడు టీఎల్‌ఎంలను (కృత్యాధార పద్ధతులు) వినియోగించాలని హనుమకొండ డీఈఓ డి.వాసంతి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని లష్కర్‌బజార్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు రెడీమేడ్‌గా తయారుచేసిన టీఎల్‌ఎంలు కాకుండా వారే సొంతంగా తయారు చేసుకోవాలని సూచించారు. 14 మండలాల నుంచి 140మంది ఉపాధ్యాయులు టీఎల్‌ఎం చార్టులను ప్రదర్శించారు. ప్రదర్శనలోని టీఎల్‌ఎంల నుంచి తెలుగు ఉర్దూ, ఇంగ్లిష్ భాషలో మూడు, గణితంలో రెండు, ఈవీఎస్‌లో ఒకటి రాష్ట్రస్థాయి మేళాకు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ బండారు మన్మోహన్, ఎంఈఓ నెహ్రూ నాయక్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి, వేణు ఆనంద్, మధుసూదన్ రెడ్డి, ఎం.సోమయ్య, కేశవరావు, అశోక్‌కుమార్, వెంకటరామ్‌రెడ్డి పాల్గొన్నారు. డీఈఓ వాసంతి ఆయా ఉపాధ్యాయులకు ప్రశంసపత్రాలు అందజేశారు.

కేఎంసీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాలకు.. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సంధ్య అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు. ఉస్మానియా, గాంధీ, కాకతీయ అండ్ తెలంగాణ మెడికల్ అల్యూమ్ని వార్షిక మహాసభ-2025 (ఓజీకేటీఎంఏ) అమెరికాలోని కెంటకీ లూయిస్విల్ మారియట్ ఈస్ట్‌లో ఈనెల 6వ తేదీన నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ సుంకరనేని సంధ్య క్రిటీ-2025 (కాకతీయ రీసెర్చ్ ఇన్సెటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మెటివ్ ఇన్నోవేషన్) పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య కేఎంసీ అభివృద్ధికి అల్యూమ్ని చేస్తున్న సహకారాన్ని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ అవకాశాల కోసం విద్యార్థులకు ఎన్ఆర్ఐ పూర్వ విద్యార్థుల మెంటర్‌షిప్ అవసరాన్ని వివరించారు. ఈ ప్రతిపాదనలకు ఎన్ఆర్ఐ అల్యూమ్ని పూర్తి మద్దతు ప్రకటించి కళాశాల అభివృద్ధి తోడ్పాడుతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

మొదటి ప్రశంస కాళోజీదే

నేను రాసి, చదివిన కవిత బాగుందని మెచ్చుకోవడం మరిచిపోలేని జ్ఞాపకం



- ఆయన పేరిట సాహితీ పురస్కారానికి ఎంపికైనందుకు సంతోషంగా ఉంది..
- అమ్మ ప్రోత్సాహంతో రచనలు.. భర్త సహకారం కొనసాగించేలా చేశాయి..
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో కాళోజీ సాహితీ పురస్కారం-2025 గ్రహీత నెల్లుట్ల రమాదేవి

'ప్రజాకవి కాళోజీ నారాయణరావుతో పరిచయం ఉంది. మొదటి సారి 1990 హనుమకొండలో బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్న సమయంలో కాళోజీ నారాయణరావు ఇంట్లో మిత్రమండలి సమావేశం జరిగింది. ఆ సమావేశానికి వెళ్లిన నేను మొదటిసారి ఆయనను ప్రత్యక్షంగా చూశా. అప్పటికే ప్రజాకవిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా గొప్ప పేరుంది. ఆయన ముందు ధైర్యం చేసి నేను రాసిన ఒక కవితను చదివాను. దానికి కాళోజీ నన్ను అభినందించడం ఇప్పటికీ గుర్తు ఉంది.' అని అన్నారు తెలుగు కవయిత్రి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవి. ఆమెను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక కాళోజీ సాహితీ పురస్కారం-2025కు ఎంపిక చేసిన నేపథ్యంలో నేడు (మంగళవారం) కాళోజీ జయంతి సందర్భంగా సోమవారం 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఉద్యోగం చేస్తూనే ఆమె చేసిన రచనలు, రాసిన కథలు.. గీసిన కార్టూన్లు, కాళోజీతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. వివరాలు ఆమె మాటల్లోనే..

– సాక్షిప్రతినిధి, వరంగల్/స్టేషన్‌ఘన్‌పూర్

బహుముఖ ప్రజ్ఞాశాలి.. రమాదేవి

నెల్లుట్ల రమాదేవి... తెలుగు కవయిత్రి, కథకురాలు, ఉపన్యాసకురాలు, కార్టూనిస్టు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ రైతు కుటుంబానికి చెందిన రాంచందర్‌రావు, శకుంతలా దేవి దంపతులకు జన్మించారు. 1983లో దేవేందర్‌ను వివాహమాడిన ఆమె 1984లో గ్రామీణ బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి ఆంధ్రాబ్యాంకు సీనియర్ మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు. కవి, రచయిత్రి, కార్టూనిస్టుగా రాణించిన రమాదేవి మొదటి కార్టూన్ 1978లో స్వాతిలో అచ్చయ్యింది. ఆ తర్వాత అనేక కథలు, కథానికలు ఆమెకు మంచి గుర్తింపు తేగా.. 2013 సంవత్సరానికి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తిపురస్కారం అందుకున్నారు. కథలు, కవిత్వమే కాకుండా కార్టూన్లు వేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా రమణీయమైన కావ్యాలతో అందరినీ ఆకట్టుకున్న రమాదేవి కాళోజీ సాహితి పురస్కారం -2025కు ఎంపికయ్యారు.

1980లో తొమ్మిదో తరగతిలో స్నేహ అనే నాటిక రాశాను. అనంతరం మొదటగా బుజ్జాయి అనే పిల్లల పత్రికలో నేను రాసిన కథను ప్రచురించారు. ఈ తరం అమ్మాయి అనే కథను ఒక మహిళా మ్యాగజైన్‌కు వాడుకున్నారు. నా చిన్నప్పటినుంచే మా అమ్మ శకుంతలాదేవి కథల పుస్తకాలు బాగా చదివేది. మాకు కథలు చెప్పేది. అలా కథల పుస్తకాలు చదువుతూ నేను కూడా కథలు రాయాలనుకున్నా. నన్ను మొదట ప్రోత్సహించింది మా అమ్మనే. అదేవిధంగా 1983లో వివాహం జరిగింది. భర్త దేవేందర్ జిల్లా కోఆపరేటివ్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసేవారు. ఆయన నన్ను బాగా ప్రోత్సహించేవారు. కథలు, రచనలకు, కార్టూన్‌లకు తన అభిప్రాయాలు, సూచనలు చేసేవారు. అయితే దురదృష్టవశాత్తు 2009లో ఆయన హఠాన్మరణం చెందడం బాధాకరం.

ఆయన ధిక్కార స్వరం.. సమాజానికి దిక్సూచి..

ఒక మనిషి, కవి, రచయిత ఎలా ఉండాలని సమాజానికి దిశానిర్దేశం చేయడమే కాకుండా స్వయంగా పాటించిన గొప్పవ్యక్తి కాళోజీ. ఆయన రాసిన పలుకుబడుల భాష-బడిపలుకుల భాషతోపాటు పలు రచనలు చదివాను. ధిక్కార స్వరం అయిన కాళోజీ తెలంగాణకే కాదు మొత్తం సమాజానికి దిక్సూచి. ఆయన ఏదైనా పద్యం చెబితే వాస్తవికంగా, సరళంగా ఉండేది. రచనలు, మాటలు సూటిగా, చురుకుమనిపించేలా ఉంటాయి. ఆయన పోయెట్రీ తెలంగాణకు దిశానిర్దేశం. తెలంగాణ రాష్ట్రంలో స్వేచ్ఛగా, సంతోషంగా ఉంటున్నామంటే ఆరోజుల్లోనే తెలంగాణ గురించి మాట్లాడి, కొట్లాడిన వ్యక్తి కాళోజీ ఒక ధీరోదత్తుడు.

సీరియస్, హాస్యం.. రెండూ ఉంటాయి

కాళోజీ మంచి జోకులు వేసేవారు. ఒక సమావేశంలో ఆయనను కలిసినప్పుడు బ్యాంకు క్యాషియర్‌నైన నన్ను కేవలం పైసలు లెక్కపెడ్తున్నావా? రచనలు చేస్తున్నావా? అంటూ హాస్యంగా మాట్లాడారు. రచయితలు రచనలు చేయాలని, సమాజానికి దిశానిర్దేశం చేసేలా, ప్రజలను చైతన్యం చేసేలా రచనలు ఉండాలని చెప్పేవారు.



సినీనటి జమునతో నెల్లుట్ల రమాదేవి (ఫైల్)

కాళోజీ పురస్కారం... మొదటి మహిళగా సంతోషంగా ఉంది..

గత పదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న కాళోజీ సాహితీ పురస్కారానికి ఈ ఏడాది మొదటి మహిళగా నేను ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. 2015లో అమ్మంగి వేణుగోపాల్ ఈ అవార్డుకు ఎంపిక కాగా, అనంతరం గోరటి వెంకన్న తదితర ప్రముఖులు అందుకున్నారు. గత ఏడాది నలిమెల భాస్కర్‌కు ఈ అవార్డు అందించారు. 11వ వ్యక్తిగా మొదటి మహిళగా, కాళోజీ పుట్టిన ఓరుగల్లు బిడ్డగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

కాళోజీని చాలాసార్లు కలిసి మాట్లాడాను..

నాతో కలిసి హనుమకొండలో బ్యాంకులో పనిచేసే రవికుమార్ కాళోజీ కుమారుడని తర్వాత తెలిసింది. రవికుమార్ పద్యాలు రాసేవారు. ఇద్దరం కవితలు, పద్యాలు ఒకరికొకరం చెప్పుకునేవాళ్లం. అతడితో కలిసి కాళోజీ ఇంటికి వెళ్లి ఆ మహానుభావుడితో చాలాసార్లు మాట్లాడాను. కాళోజీకి నేను రాసిన కథలు, రచనలు చూపించి సంతోష పడ్డాను. అనంతరం రెండు, మూడు సమావేశాల్లో కలుసుకున్నాం. కాళోజీ రచనలు చాలా చదివాను. ఆయన రచనలు సరళంగా, వ్యంగ్యంగా ఉంటాయి. సమాజాన్ని సూటిగా ప్రశ్నించే ఆయన రచనలు అంటే చాలా ఇష్టం.

కాళోజీ.. ధిక్కారస్వరం

- పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై తిరుగుబావుటా ఎగరేసిన అగ్నికణం
- కవితలతో ప్రజల్లో నిత్యం చైతన్యం నింపిన స్ఫూర్తిప్రదాత
- అన్యాయాలను ఎదిరిస్తూ ప్రజాస్వామ్య విలువలు బోధించిన శక్తి..
- నేడు కాళోజీ జయంతి, తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవం

– హన్మకొండ కల్చరల్

- వివరాలు 8లో▸

అమెరికాలో శిక్షణకు హనుమకొండ ఉపాధ్యాయుడు ఎంపిక



సంపత్‌కుమార్

కమలాపూర్: మండలంలోని ఉప్పల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొక్కుల సంపత్‌కుమార్ ఈ నెల 10 నుంచి అక్టోబర్ 27 వరకు అమెరికాలో జరిగే ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్, అచీవ్‌మెంట్ శిక్షణకు ఎంపికయ్యారు. ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్, అచీవ్‌మెంట్ ప్రోగ్రాంను యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ బ్యూరో ఎడ్యుకేషనల్, కల్చరల్ అఫైర్స్ (ఈసీఏ) స్పాన్సర్ చేస్తుండగా ఐరెక్స్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి యూఎస్ ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తు చేసుకోగా, భారతదేశం నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. వారిలో తెలంగాణకు చెందిన ఇద్దరు ఉన్నారు. ఆరు వారాల ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు వృత్తిపరమైన అభివృద్ధి శిక్షణలో పాల్గొంటారు. ఇందులో సాధారణ బోధనపై సెమినార్లు, తరగతి గదిలో సాంకేతికత వినియోగంపై నేర్చుకుంటారు. ఈ శిక్షణ కోర్సులను అమెరికా విశ్వవిద్యాలయం రూపొందించి నిర్వహిస్తుంది. ట్రైనింగ్ జరిగే విశ్వవిద్యాలయానికి సమీపంలోని సెకండరీ పాఠశాలలో అమెరికా భాగస్వామి ఉపాధ్యాయుడితో కలిసి సహ బోధన, ప్రజెంటేషన్లు, పరిశీలనను పూర్తి చేయాల్సి ఉంటుందని సంపత్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

ముగిసిన చెస్‌పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-15 చదరంగ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ వేడుకలకు కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నిర్వహణ కార్యదర్శి పి.కన్నా మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. బాలుర విభాగంలో శ్రీసాయిప్రీతం కనకాల, సాయి జోషిత్ బొల్లం, మొగిలి అభినవ్‌రెడ్డి, రిత్విక్ గండు, బాలికల విభాగంలో డి.ఆరుషి, వి.దిలీషా, ఏ.ఆద్య, బి.శ్రీలాస్య విజేతలుగా నిలిచారు. ఆర్బిటర్లు సీహెచ్ శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి

కలెక్టర్ స్నేహాశబరీష్

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని 12మండలాల్లో గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని హనుమకొండ కలెక్టర్ స్నేహాశబరీష్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి ఈనెల 9న సవరించి 10వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లలో 12 మండల పరిషత్, 12 జిల్లా పరిషత్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 3,70,871 మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళలు 1,90,201, పురుషులు 1,80,666, ఇతరులు 4 ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలో 631 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ రవి సమాధానమిచ్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.వి శ్రీనివాసరావు, శ్యామ్‌సుందర్, ప్రభాకర్‌రెడ్డి, సయ్యద్ ఫైజుల్లా, నిశాంత్, రజనీకాంత్, ఎండీ నేహాల్, ఇండ్ల నాగేశ్వర్‌రావు, ప్రవీణ్‌కుమార్, జయంత్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

17నుంచి స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు..

మహిళల ఆరోగ్యమే ధ్యేయంగా ఈనెల 17వ తేదీనుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ.. ఆయా కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళలకు నిర్దేశించిన ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులచే అన్ని రకాల పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్ని పాఠశాలలు, గురుకులాలు, కళాశాలల్లో విద్యార్థినులకు అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. డీఎంహెచ్ఓ అప్పయ్య, జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ రవి, డీపీఓ లక్ష్మీరమాకాంత్, డీఈఓ వాసంతి, డీడబ్ల్యూఓ జయంతి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నిర్మల, గిరిజన, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, డాక్టర్ గౌతమ్ చౌహాన్, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, గైనకాలజిస్టుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీలక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు, విజయకుమార్, మహేందర్, హిమబిందు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహాశబరీష్

'ఓరుగల్లు'కు బీజేపీ మొండిచెయ్యి

రాష్ట్ర కమిటీలో ఎవరికీ చోటివ్వని హైకమాండ్

- సీనియర్లను పట్టించుకోని పార్టీ అధిష్టానం
- పార్టీ ఆవిర్భావం తర్వాత ఇదే మొదటిసారి
- ప్రతీసారి కమిటీలో ముగ్గురు నుంచి ఐదుగురు
- అధిష్టానం తీరుపై 'కాషాయం' నేతల కారాలు, మిరియాలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

భారతీయ జనతా పార్టీ అగ్రనాయకత్వం ఉమ్మడి వరంగల్‌కు మొండిచెయ్యి చూపింది. రాష్ట్ర కమిటీలో ఈసారి ఒక్కరికి కూడా ఛాన్స్ ఇవ్వలేదు. సోమవారం ప్రకటించిన రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్లకు ఉద్వాసన పలికింది. కమిటీలో 8 మంది ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 8 మంది కార్యదర్శులు, ఇద్దరు కోశాధికారులు, ఒక జాయింట్ ట్రెజరరీ, ఒక అధికార ప్రతినిధి కలిపి 22 మంది ని ప్రకటించారు. ఈ కమిటీలో ఉమ్మడి జిల్లాలో పార్టీ ఆవిర్భావం నుంచి కీలకంగా వ్యవహరిస్తున్న సీనియర్లకు అవకాశం ఇవ్వకపోడంపై పెద్ద చర్చే జరుగుతోంది.

మొండిచెయ్యి ఇదే మొదటి సారి..

ప్రతీసారి రాష్ట్ర కమిటీలో ఉమ్మడి వరంగల్‌కు తగిన ప్రాధాన్యత దక్కేది. సీనియర్లుగా ఉన్న ముగ్గురు నుంచి ఐదుగురికి అవకాశం కల్పించిన సందర్భాలే ఉన్నాయి. బండి సంజయ్‌కుమార్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. ఆ తర్వాత వచ్చిన కిషన్ రెడ్డి కూడా సీనియర్లకు అవకాశం కల్పించారు. 2023, జూలై 4న బండి సంజయ్.. ఆ తర్వాత పగ్గాలు చేపట్టి జి.కిషన్ రెడ్డిలు పూర్తిస్థాయిలో రాష్ట్ర కమిటీ వేశారు. అందులో ఉమ్మడి జిల్లా నుంచి డాక్టర్ గుండె విజయ రామారావు (ఉపాధ్యక్షుడు), గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (ప్రధాన కార్యదర్శి), ఏనుగుల రాకేష్ రెడ్డి (అధికార ప్రతినిధి, ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్నారు), చందుపట్ల కీర్తిరెడ్డి (అధికార ప్రతినిధి), జాటోత్ హుస్సేన్ నాయక్ (ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు), కొండేటి శ్రీధర్ (ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు)లకు అవకాశం కల్పించారు. ఈసారి కూడా ఉమ్మడి వరంగల్‌కు రాష్ట్ర కమిటీలో సముచిత స్థానం దక్కుతుందని భావించినా.. ఒక్కరికీ కూడా అవకాశం కల్పించకపోవడంపై సీనియర్లు భగ్గుమంటున్నారు. 1980లో పార్టీ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర కమిటీలో జిల్లాకు ప్రాతినిధ్యం లేకుండా సందర్భం లేదని, సుమారు నాలుగున్నర దశాబ్దాల తర్వాత బహుశా ఇది మొదటి సారని పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

ఓరుగల్లు నుంచి మహామహులు...

బీజేపీ, జనసంఘ్.. పార్టీలకు ఉమ్మడి వరంగల్ పెద్దపీట వేసింది. బీజేపీ ఆవిర్భావం తర్వాత ఈ జిల్లాలో ఉన్నంత బలం బలగం ఎక్కడా లేదన్న వ్యాఖ్యలు నాయకత్వం చేసిన సందర్భం. ఎంపీగా పోటీ చేసిన చందుపట్ల జంగారెడ్డి ఏకంగా పీవీ నర్సింహారావును ఓడించడం.. ఎమ్మెల్యేగా కూడా ఓసారి పార్టీ బ్యానర్ మీదే గెలిచారు. బీజేపీనుంచి ఎమ్మెల్యేలుగా టి.రాజేశ్వర్‌రావు, జయపాల్, వన్నాల శ్రీరాములు, మార్తినేని తదితరులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. పార్టీ అధిష్టానం కూడా ప్రతీసారి సంస్థాగత పదవుల విషయంలో వరంగల్‌కు పెద్దపీట వేస్తూ వచ్చింది. ఈసారి కూడా రాంచందర్‌రావు టీములో సీనియర్లకు ఛాన్స్ ఉంటుందని భావిస్తే తీవ్ర నిరాశకు గురికావాల్సి వచ్చింది.

రాష్ట్ర కమిటీలో సీనియర్ల ఊసేది..?

పూర్వ వరంగల్ జిల్లాలో వన్నాల శ్రీరాములు, మాజీ మంత్రి గుండె విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు, డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, చందుపట్ల కీర్తిరెడ్డి, రావు పద్మలలో ఎవరికీ ఈసారి కమిటీలో చోటు దక్కలేదు. అదేవిధంగా పార్టీలో సీనియర్లుగా ఉన్న ఆరుట్ల దశమంతరెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి, డాక్టర్ కాళీప్రసాద్, ఎడ్ల అశోక్‌రెడ్డి, చాడ శ్రీనివాస్ రెడ్డి, రావుల కిషన్, కోరబోయిన సాంబయ్య, గుజ్జ సత్యనారాయణరావు, గంట రవికుమార్, ముక్కెర తిరుపతిరెడ్డిలతో పాటు పలువురు కూడా రాష్ట్ర కమిటీలో పదవులు ఆశించగా.. అధిష్టానం సీనియర్లను విస్మరించిందన్న చర్చ పార్టీలో జరుగుతోంది.

యూరియా కోసం రైతుల ఆందోళన

పరకాల: యూరియా కోసం రైతులు ఆందోళన బాటపట్టారు. పరకాల వ్యవసాయ మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. సోమవారం మాదారం పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందన్న సమాచారంతో పరకాల, నడికూడ మండలాలకు చెందిన 14గ్రామాల నుంచి వందలాది మంది రైతులు తెల్లవారుజాము నుంచే మార్కెట్ వద్దకు చేరుకున్నారు. దీంతో రైతువేదిక వద్ద చంటిపిల్లలతో చేరుకున్న మహిళ రైతులు నానా అవస్థలు పడ్డారు. దిగుమతి అయిన 440బస్తాల యూరియాను అధికారులు పంపిణీ చేయడంతో మిగతా రైతులు ఒక్కసారిగా ఆగ్రహానికి గురై రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని రైతులకు నచ్చజెప్పి మరో 100మంది రైతులకు టోకెన్లు ఇప్పించారు. వారంతా నడికూడ మండల కేంద్రంలోని ఆగ్రోస్ ద్వారా తీసుకోవాలని సూచించారు.



పరకాల: రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా కోసం క్యూలో చెప్పులు

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెం, శనిగరం పీఏసీఎస్‌తో పాటు ఇఫ్కో కేంద్రానికి సోమవారం యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు తెల్లవారుజామున 3 గంటల నుంచే బారులుదీరారు. గంటల తరబడి నిల్చోలేక రైతులు తమ చెప్పులు క్యూలో పెట్టారు. అయినా రైతులందరికి యూరియా దొరక్కపోవడంతో అన్నదాతలు నిరాశతో వెనుదిరిగారు. పనులన్నీ వదులుకుని గంటల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందన్నారు.



కమలాపూర్: మర్రిపల్లిగూడెంలో యూరియా కోసం క్యూలో పెట్టిన చెప్పులు

2.14 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

ఐనవోలు : అక్రమంగా తరలిస్తున్న 2.14 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఎన్. వెంకటేశ్ వివరాలు వెల్లడించారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఆదివారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టగా ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్ 19 ఏఎక్స్ 7887 నంబర్‌గల హోండా సిటీ కార్ వస్తుంది. తనిఖీలు చేస్తున్న పోలీసులను గమనించిన కారు నడుపుతున్న వ్యక్తి వెనకకు తిప్పుకుని వెళ్లడానికి ప్రయత్నించాడు. పోలీసులు అనుమానంతో కారును ఆపి తనిఖీలు చేశారు. కారు డిక్కీలో ఉన్న ప్యాకెట్లను వెలుపలికి తీసి చూడగా ఎండు గంజాయిగా నిర్ధారించుకున్నారు. వెంటనే పోలీసులు కారు నడుపుతున్న మహారాష్ట్రలోని బుల్ధానా జిల్లా మోతాల మండలం ఏటీకుర్తా గ్రామానికి చెందిన రైతు శివ సింగ్ డొంగర్ సింగ్ గోటిని అదుపులోకి తీసుకున్నారు. 214 కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినున్నట్లు ఏసీపీ ఎన్.వెంకటేశ్ తెలిపారు. ఎస్సై శ్రీనివాస్, సిబ్బందితో పాటు పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌కు అభినందనలు తెలియజేశారు.



గంజాయితో పాటు నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ వెంకటేశ్, సీఐ రాజగోపాల్, ఎస్సై

ఆలయాల్లో శుద్ధి.. సంప్రోక్షణ



భద్రకాళి ఆలయాన్ని శుద్ధి చేస్తున్న సిబ్బంది



శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : సంపూర్ణ చంద్రగ్రహణం వల్ల ఆదివారం నగరంలోని పలు ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం ఆయా దేవాలయాల్లో గ్రహణ సంప్రోక్షణలు శుద్ధిచేసి దేవతామూర్తులకు అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనానికి అనుమతించారు. వేయిస్తంభాల దేవాలయంలో గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో శ్రీరుద్రేశ్వర స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీభద్రకాళి దేవాలయంలో ఆలయ వేదపండితులు పార్నంది నరసింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు సంప్రోక్షణలో భాగంగా హోమం నిర్వహించారు. అలాగే దసరా నవరాత్రుల సందర్భంగా దాతల సహకారంతో దేవాలయానికి రంగులు, సున్నాలు వేయించారు. వరంగల్‌లోని ఎంజీఎం ఎదురుగా గల శ్రీరాజరాజేశ్వరీదేవి దేవాలయంలో అర్చకులు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.



సంప్రోక్షణలో భాగంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అక్రమ కేసులపై న్యాయస్థానాల్లో పోరాడుదాం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




కేటీఆర్‌ను కలిసిన వినయ్‌భాస్కర్, లీగల్ సెల్ బాధ్యులు

హన్మకొండ : అక్రమ కేసులపై న్యాయస్థానాల్లో పోరాడుదామని, బీఆర్‌ఎస్ శ్రేణులకు లీగల్ సెల్ అండగా ఉంటుందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, లీగల్ సెల్ హనుమకొండ, వరంగల్ జిల్లా బాధ్యులు కేటీఆర్‌ను కలిసి ప్రత్యేకంగా మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో యూరియా పంపిణీ, కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం హనుమకొండ చౌరస్తాలో బీఆర్‌ఎస్ పార్టీ ధర్నా నిర్వహించిన నేపథ్యంలో పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేశారని లీగల్ సెల్ బృందం కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గులాబీ శ్రేణుల పక్షాన పార్టీ లీగల్ సెల్ పోరాడుతుందని అన్నారు. అక్రమ కేసులకు భయపడబోమని, బీఆర్‌ఎస్ శ్రేణులకు ఉద్యమాలు కొత్త కాదని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ సెల్ బాధ్యులు, సీనియర్ న్యాయవాది తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కాళోజీ.. ధిక్కారస్వరం

పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై తిరుగుబావుటా ఎగరేసిన అగ్నికణం

- కవితలతో ప్రజల్లో నిత్యం చైతన్యం నింపిన స్ఫూర్తి ప్రదాత
- అన్యాయాలను ఎదురిస్తూ ప్రజాస్వామ్య విలువలు బోధించిన శక్తి..
- నేడు కాళోజీ జయంతి, తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవం



కాళోజీ నారాయణరావు (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు.. ధిక్కార స్వరానికి మారుపేరు. ప్రశ్నించేతత్వానికి చిరునామా. 'ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం.. ప్రాంతేతరులు దోపిడీ చేస్తే తన్ని తరుముతాం.. దోస్తుగ ఉండే వారితో మేమూ దోస్తే చేస్తం.. ప్రాణమిస్తం.. ఎంతకు అంత అన్న ధోరణితో చింతమాని బతుకు సాగిస్తం' అంటూ తన కవితల ద్వారా నిరంతరం పాలకులపై ధిక్కారస్వరం వినిపించేవారు. తెలంగాణ మాండలికంలో తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరిచేవారు.ఈక్రమంలో మంగళవారం కాళోజీ జయంతి, తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ నారాయణరావుపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

మానవత్వ విలువలు ప్రబోధించిన శక్తి..

మానవత్వ విలువలు ప్రబోధించిన శక్తి.. తన భావాలకే కాదు శరీరానికి మరణం లేదని నిరూపించిన వ్యక్తి పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు. 1914 సెప్టెంబర్ 9వ తేదీన రంగారావు, రమబాయి దంపతులకు కాళోజీ జన్మించారు. పూర్తి పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ. మడికొండలో ప్రాథమిక విద్య, హనుమకొండ, హైదరాబాద్‌లలో ఉన్నతవిద్యనభ్యసించారు. కాళోజీ పదిహేనేళ్ల వయసు నుంచే రాజకీయ ఉద్యమాలు, కవిత, రచనా వ్యాసంగాలలో మునిగిపోయారు. ఆర్య సమాజం, ఆంధ్రమహాసభ, నిజాంస్టేట్ కాంగ్రెస్‌లో సభ్యుడిగా ఉంటూ నైజాం వ్యతిరేకపోరాటంలో పనిచేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1958 నుంచి 1960 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా, ఆంధ్రసారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీల్లో సభ్యుడిగా, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, కాళోజీ సతీమణి రుక్మిణి కాళోజీ ఉద్యమాలు, అరెస్టుల నేపథ్యంలో ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకున్నారు.

కాళోజీ అభిప్రాయాలు ...

ఏకీభవించనోని పీక నొక్కుటే ఫాసిజం..

శాంతిని అందరూ కోరుకుంటున్నట్లు మాట్లాడుతారు. శాంతిగా మెలగుటమంచిదే. కానీ శాంతి పరిస్థితి కలదా సఖుడా! అన్నది నా ప్రశ్న. 'శాంతి శాంతట శాంతి గుండె మండిపోతుంటే, కండ కరిగిపోతుంటే బతుకు చితికిపోతుంటే, ఎముక విరిగిపోతుంటే శాంతి శాంతట శాంతి'. హింస హింస అని వూరికే అంటుంటారు. నా దృష్టిలోనూ హింస తప్పు. రాజ్యహింస మరీ తప్పు. ప్రతి హింస తప్పుకాదు. ఏకీభవించనోని పీక నొక్కు సిద్ధాంతం అంటే మరేమిటోకాదు అచ్చమైన ఫాసిజం. నాగొడవలో హిరణ్యకశిపుడు అచ్చమైన ఫాసిస్టు ప్రహ్లాదుడు సత్యాగ్రహి, సత్యాగ్రహం వల్ల ఫాసిస్టుల్లో పరివర్తన జరగనప్పుడు నరసింహుల్లా ప్రతిహింస తప్పదు.

అన్యాయాన్నెదిరించిన వాడే ఆరాధ్యుడు..

మ్రోగుతున్న ప్రజల వాణి/ ఆగి మూగపోతున్నద?/ దోపిడీ పెత్తన్‌దారికి / తోడా? ఆ చావు కూడా/ ఎదిరించిన ప్రతీ వ్యక్తికి / ఈ వ్యవస్థలో అవస్థ/ రాజీపడు 'మేతావి'/ పాజీలకు మజామజా.. అన్యాయాన్నెదిరించిన/ వాడు నాకు ఆరాధ్యుడు/ పేరుకు బతికున్న ప్రభుత్వం/ పేరుకు చస్తున్న 'రాజు' / అన్నాయాన్నేదిరిస్తే నాగొడవకు సంతృప్తి / అన్యాయం అంతరిస్తే/ నాగొడవకు ముక్తిప్రాప్తి.

ప్రశ్నించడం మానొద్దు..

ప్రశ్నలడగడంలో నేనెప్పుడు ప్రథముడినే. 1946లో నైజాం రాజును అడిగా నేను అడగడం మాత్రం మానలేదు. నిజమైన కవి అన్నవాడు జనం కోసం న్యాయం అడుగుతాడు. ఎవరి పనుల్లో వారు మునిగిపోగుడదు. ఎవరి బాగు వాళ్లు చూసుకుంటూ కూర్చోకూడదు. నిలదీసి ప్రశ్నించినవారిని ప్రభుత్వం బందిస్తుంది. వాళ్లమీద కక్షగడుతుంది. అయినా ప్రభుత్వం చూపించే ఎరలకు లొంగిపోకూడదు. ఆలోచించాలి.. అడగాలి. ప్రశ్నలు అందరూ అడగాలి. చైతన్యం కలిగించాలి. తిరగబడాలి. ఎదురించాలి.

రైతుబాధలు..

రాణివాసములోన రంజిల్లు రాజా/ రైతు బాధలు తీర్చి రక్షించ లేవా/ పట్టణపు సొగసుకై పాటుపడు రాజా/ పల్లెకందము గూర్చు బాధ్యత తెలియదా?/ ప్రజలను హింసించు ప్రభువు మాకేల? / వధియించి భక్షించ వనరాజు లేడా?/ సామాన్య ప్రజలకు చైతన్య మొదవ/ చతురంగ బలముండ జంకేల రాజా?

జాగ్రత్త..

మనసు సంతలో బేరమాడబోకు/ బతుకు పెన్నిధిని గవ్వల కమ్మబోకు నిన్ను మించినదేమున్నది కోరుకొనగ/ ఆశనిరాశల వసతి మనసు కాగూడదెప్పుడు/ కలము గారడీ చేయకు కవితనెపుడు.

నడత – నాణ్యం..

దొంగవలె అందాల తొంగిచూచుట తప్పు/ ఆగుపడిన అందాన్ని అరయకుండుట తప్పు/ కనపడ్డ ప్రతీదాని కానపడుటయు తప్పు/ భంగపడి వాంఛలకు లొంగిపోవుట తప్పు/ కినుకతో మదిలోన కృంగిపోవుట తప్పు/ పైకి ప్రహ్లాదువలె పలుకుచుండుట తప్పు/ సహజ ప్రవృత్తులను చంపివేయుట తప్పు/ సహజమని వృత్తుల చంకచేరుట తప్పు..

స్వేచ్ఛ..

బాధ్యత ఎరుగని స్వేచ్ఛ
బానిసత్వ లక్షణము
బాధ్యత ఎరిగిన స్వేచ్ఛ
స్వాతంత్రపు రక్షణము

వ్యక్తిత్వం..

'ప్రతివారికి వ్యక్తిత్వం ఉంటేనే పౌరత్వం
వ్యక్తిత్వం భద్రంగా ఉంటేనే వ్యక్తి బతుకు
వ్యక్తిత్వం భద్రంగా ఉంటేనే జాతి బతుకు'



భార్య రుక్మిణితో కాళోజీ(ఫైల్)

నేడు తెలంగాణ భాషా దినోత్సవం..

కాళోజీ జన్మదినమైన సెప్టెంబర్ 9వ తేదీని తెలంగాణ భాషా (మాండలిక) దినోత్సవంగా జరుపుకోవాలని 2014 సెప్టెంబర్ 9న వరంగల్‌లోని నిట్ కళాశాలలో జరిగిన కాళోజీ నారాయణరావు 100వ జయంతి సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.

ఉద్యమ ధ్వజం..

అక్షరాలను అగ్ని కణాలుగా
విరజిమ్మావు..
అఖిలాండంలోని అనాథలగాథలను
వినిపించావు
అణగదొక్క గర్జించావు
అధికారం ముసుగులో
కాళికవై కదిలావు
ప్రశ్నించేతత్వానికి ప్రహ్లాదుడే
గురువని ప్రవచించావు
ఉప్పెనలా ఎగిసిపడే ఉద్యమాలకెన్నిటికో
ఊపిరిగా నిలిచావు
ప్రజల భాషలో ప్రజల గొడవకు
పట్టం కట్టావు
నిర్మోహ్మటం, నిజాయతీలనే
త్రికరణశుద్ధిగా పాటించావు
సామాన్యుడిగా ఉంటూనే సాహసంతో
సత్యాగ్రహిగా బతికావు
తెలంగాణ పోరు తేరుపై
'ఉద్యమ ధ్వజం'గా మిగిలావు



- కాళోజీ జయంతి సందర్భంగా పాలకుర్తికి చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్.
(9989148305)
-పాలకుర్తి టౌన్

కాజీపేట జంక్షన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

- 11వ తేదీ నుంచి అమల్లోకి..



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణికుల సౌకర్యార్థం దసరా, దీపావళి పండుగల సందర్భంగా చర్లపల్లి–ససరమ్ మధ్య 22 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

సెప్టెంబర్ 11 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు చర్లపల్లి–ససరమ్ (07021) మధ్య 11 ప్రత్యేక రైళ్లు ప్రతీ గురువారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుని వెళ్తాయి. అదేవిధంగా సెప్టెంబర్ 12 నుంచి నవంబర్ 21వ తేదీ వరకు ససరమ్–చర్లపల్లి (07022) మధ్య 11 ప్రత్యేక రైళ్లు ప్రతీ శనివారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుని వెళ్తాయి. 1 -ఏసీ, 2 -ఏసీ, 3 -ఏసీ, స్లీపర్ క్లాస్ అండ్ జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ప్రయాణించే ఈ రైళ్ల సర్వీస్‌లకు జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, పిపరియా, మదన్ మహల్, కట్నీ, సంత, మణిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్, దీన్‌దయాల్ ఉపాధ్యాయ స్టేషన్‌లలో హాల్టింగ్ కల్పించినట్లు ఆయన తెలిపారు.

పలు స్టేషన్లలో హాల్టింగ్ కొనసాగింపు

కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లకు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన తాత్కాలిక హాల్టింగ్‌లను కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ సోమవారం తెలిపారు.

హాల్టింగ్ స్టేషన్లు ఇవే

దానాపూర్–సికింద్రాబాద్ (12792) దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంట, నర్సాపూర్–నాగర్‌సోల్ (12787) ఎక్స్‌ప్రెస్‌కు మహబూబాబాద్, నాగర్‌సోల్–నర్సాపూర్ (12788) ఎక్స్‌ప్రెస్‌కు మహబూబాబాద్, పూణె–కాజీపేట (22151) ఎక్స్‌ప్రెస్‌కు మంచిర్యాల, కాజీపేట–పూణె (22152) ఎక్స్‌ప్రెస్‌కు మంచిర్యాల రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు సీపీఆర్వో తెలిపారు.

కుర్చీ మీద ప్రేమతోనే బీజేపీ హిందూ నినాదం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

హన్మకొండ: కుర్చీ మీద ప్రేమతోనే బీజేపీ హిందూ నినాదం ఎత్తుకుందని, అధికారం కోసం అడ్డదారులు తొక్కుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు దుయ్యబట్టారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సెక్యులరిజం, సోషలిజం పదాలను రాజ్యాంగం నుంచి తీసివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీబీఐ, ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలను వారికి అనుకూలంగా మలుచుకున్నారని, ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారని తూర్పారబట్టారు. ఉప రాష్ట్రపతిగా పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పుకు బీజేపీ వక్రభాష్యం పలుకుతుందని విమర్శించారు. కమ్యూనిస్టులంటే ప్రధాని మోదీ, బీజేపీకి భయమన్నారు. భగత్ సింగ్, సుభాష్‌చంద్రబోస్, దొడ్డి కొమురయ్య, చివరకు చాకలి ఐలమ్మ, తెలంగాణ సాయుధపోరాటాన్ని బీజేపీ హైజాక్ చేసిందని మండిపడ్డారు. దేశానికి కమ్యూనిస్టుల అవసరం ఉందని, తామంత ఒకటయ్యే సమయం వస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌పై రాష్ట్రంలో రకరకాల ఊహాగానాలు సాగుతున్నాయని, బీజేపీలో విలీనం కానుందని, ఇతర చర్చలు జరుగుతున్నాయన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు పార్టీ ముందుకెళ్తుందన్నారు. సభలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, సీపీఎం, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శులు జి.ప్రభాకర్ రెడ్డి, కర్రె భిక్షపతి, సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, నాయకులు నేదునూరి జ్యోతి, టి.వెంకట్రాములు, సదాలక్ష్మి, పనాస ప్రసాద్, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, వలీఉల్లాఖాద్రి, టి.విశ్వేశ్వర్ రావు, పల్లె నర్సింహ, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, అరూరి కుమార్ పాల్గొన్నారు.

డిజటల్ ప్రపంచాన్ని ఉపయోగించుకోవాలి

- డీఈఓ రంగయ్యనాయుడు

ఖిలా వరంగల్: విద్యార్థులు డిజిటల్ ప్రపంచాన్ని ఉపయోగించుకుని పరిశోధనాత్మక విద్యను అందుకోవాలని వరంగల్ డీఈఓ రంగయ్యనాయుడు సూచించారు. సోమవారం వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఈఓ రంగయ్యనాయుడు, అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్ అధికారి రమేశ్‌రెడ్డి హాజరై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస, నినాదాల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. అక్షరాస్యత సమాజాభివృద్ధికి, వ్యక్తి ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి అత్యంత ముఖ్యమని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు వారు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బత్తుల ప్రసాద్, అధికారులు సీహెచ్ నాగేశ్వరరావు, పిన్నింటి బాలాజీ రావు, సుందర్ పాల్గొన్నారు.

ప్రయత్నాలు వినూత్నం.. ఫలితాలు శూన్యం

- ఫిర్యాదుదారులతో మాట్లాడించిన కలెక్టర్ ఆతర్వాత అర్జీల స్వీకరణ
- సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అర్జీదారుల మొర

నూ్యశాయంపేట: ప్రజావాణిలో గత రెండు, మూడు వారాలుగా ఉన్నతాధికారులు వినూత్న ఆలోచనతో ఫిర్యాదుదారుల సమస్యల్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక వారం అధికారులు కలెక్టర్ వెనకాల కూర్చోగా.. ఎదురుగా ఎదురుగా ఫిర్యాదు దారులు కూర్చున్నారు. సమస్యల్ని అధికారులకు వివరించారు. ఈవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ముందుగా అర్జీదారులందరితో మాట్లాడించారు. సమస్యలను అక్కడున్న సంబంధిత అధికారులకు వివరించే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారుల ఆలోచనలు బాగున్నప్పటికీ.. కింది స్థాయి అధికారులు ప్రజల వినతులను పరిష్కరించేందుకు శ్రద్ధ చూపడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఆలోచనలు సరే ఆచరణేది? అంటూ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

వినతులు సత్వరమే పరిష్కరించండి

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల్ని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ప్రజావాణిలో 136 ఫిర్యాదులు రాగా.. అధికంగా రెవెన్యూ సమస్యలు 60, జీడబ్ల్యూఎంసీ 21, విద్యాశాఖ 11, సహకార శాఖ 9, గృహ నిర్మాణ శాఖ 7, వైద్య ఆరోగ్యశాఖ, ఉపాధికల్పన శాఖలకు 3 చొప్పున, ఇతర శాఖలకు సంబంధించి 22 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. 'వరంగల్ జిల్లా మీదుగా వెళ్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాలని పోరాడాం. పరిష్కారం కాలేదు' అని బాధిత రైతులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఓ అనురాధ, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, గృహనిర్మాణ శాఖ పీడీ గణపతి, డీసీఓ రాజమణి, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ఆర్సీఓ అపర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దారులు, విభాగాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

అనాలోచిత ఏర్పాట్లు.. దివ్యాంగులకు ఇక్కట్లు

అధికారుల అనాలోచిత చర్యతో సోమవారం ప్రజావాణికి వచ్చిన దివ్యాంగులు ఇబ్బందులు పడ్డారు. కలెక్టరేట్ సమావేశ హాల్ వెనుక డోర్ వద్ద దరఖాస్తులు స్వీకరించి వరుస క్రమంలో ఫిర్యాదులను స్కాన్ చేసి ఫిర్యాదుదారులను వరుస క్రమంలో పంపేవారు. కానీ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమావేశ హాల్‌లోకి వచ్చే దారిలో ర్యాంపు ఎదురుగానే కంప్యూటర్ పెట్టుకుని సిబ్బంది కూర్చున్నారు. దీంతో ర్యాంపు మీదుగా రాలేక దివ్యాంగులు మెట్లు, ఎక్కుతూ, దిగుతూ ఇబ్బందులు పడి కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చి వచ్చారు.



ఇబ్బందులు పడుతూ మెట్లద్వారా కిందికి దిగుతున్న దివ్యాంగుడు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రీన్‌ఫీల్డ్ బాధిత రైతులు

వినతుల పరిష్కారానికి చర్యలు

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్ : ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు వినతుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని సూచించారు. ప్రజావాణిలో హౌసింగ్ పీడీ–20, తహసీల్దార్ హసన్‌పర్తి–15, ఆర్‌డీఓ హనుమకొండ–14, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ –13లతో పాటు వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 150 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వై.వి గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేష్, నారాయణ, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సినీఫక్కీలో కిడ్నాప్..?

- డబ్బుల కోసం 32 ఏళ్ల యువకుడి హైడ్రామా
- ఐదు గంటల్లో కథ సుఖాంతం



కిడ్నాప్ ప్రణాళిక రూపొందించిన యువకుడు

రామన్నపేట : బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఓ యువకుడు అప్పులపాలయ్యాడు.. తల్లిదండ్రుల నుంచి ఎలాగైనా డబ్బులు లాగాలని తనకు తానే కిడ్నాప్ డ్రామాకు తెరలేపాడు. అతనికి పరిచయమైన ఓ ఆటో డ్రైవర్‌తో తానే కిడ్నాప్ అయ్యి తన తండ్రికి రూ.10లక్షలు కావాలని ఫోన్ చేయించాడు. ఈ క్రమంలో సదరు యువకుడి తండ్రి పోలీసులను ఆశ్రయించడంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. వరంగల్ పోచమ్మ మైదాన్ ప్రాంతానికి చెందిన 32ఏళ్ల అదిల్ సోనీ జకోటియా కాంప్లెక్స్ సమీపంలో ఆటో స్పేర్ పార్ట్స్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విలాసాలతోపాటు బెట్టింగ్‌లకు అలవాటు పడి రూ.5లక్షలకు పైగా అప్పులయ్యాయి. ఎలాగైనా అప్పు తీర్చాలని తనకు పరిచయమైన యాకూబ్ అనే ఆటో డ్రైవర్‌తో కిడ్నాప్ చేయాలని ప్రణాళిక రూపొందించుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం నిజమైన తరహాలో కిడ్నాప్ అయినట్లు సీసీ కెమెరాలకు చిక్కకుండా ఆటోలో కొంతమంది వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ నటించారు. అక్కడి నుంచి వెళ్లిన తర్వాత తన తండ్రి అశోక్ సోనీకి యాకూబ్ ఫోన్ చేసి ×మీ కొడుకును కిడ్నాప్ చేశాం. రూ.పది లక్షలు కావాలి.. శాయంపేట జంక్షన్‌కు రావాలని× అని బెదిరించారు. ఈ విషయాన్ని అశోక్ సోనీ పోలీసులకు చెప్పడంతో అప్రమత్తమయ్యారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా రాత్రి 9గంటల ప్రాంతంలో బృందాలుగా విడిపోయి చింతల్ వద్ద వారిని పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా అసలు విషయం తెలిసి పోలీసులు అవాక్కయ్యారు. దీనిపై పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

రెనోవా బన్ను ఆస్పత్రి ప్రారంభం

- సామాన్యులకు అందుబాటులో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అతిథులు

ఎంజీఎం : ప్రజలకు ప్రపంచ స్థాయి నాణ్యతతో క్యాన్సర్ చికిత్స అందించేందుకు రెనోవా బన్ను ఆస్పత్రిని ప్రారంభించినట్లు రెనోవా గ్రూపు ఆస్పత్రి ఫౌండర్ సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ములుగు రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రిని సోమవారం ఆరోగ్యవర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ నాగార్జునారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ ప్రాంతంలో తొలి సమగ్ర క్యాన్సర్ ఆస్పత్రిగా రెనోవా బన్ను ఆస్పత్రి నిలుస్తుందని తెలిపారు. ఈ ఆస్పత్రిలో అత్యాధునిక సదుపాయాలైన దాదాపు రూ. 20 కోట్ల విలువైన హెల్‌కాయిన్ ఇమేజ్ గైడెడ్ రేడియేషన్, దాదాపు రూ.6 కోట్ల విలువైన పెట్ సిటీ పరికరాలతో అంతర్జాతీయ స్థాయి చికిత్స సదుపాయాలు వరంగల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రభాకర్‌రావు, ఐఎంఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో ఫిజియోథెరపీ కీలకం



ఫిజియోథెరపిస్ట్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

- ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు

హన్మకొండ: వైద్య రంగంలో ఫిజియోథెరపీ చికిత్స కీలకమని వర్ధన్నపేట ఎమ్మె ల్యే కె.ఆర్.నాగరాజు అన్నారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా లయన్స్ క్లబ్ హనుమకొండ ఫిజియోథెరపిస్ట్ ఆవిర్భావ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రోగుల ఆరోగ్య పునరుద్ధరణలో ఫిజియోథెరపీ చికిత్స కీలకమన్నారు. శరీర నొప్పులు, గాయాలు, స్ట్రోక్‌లు, శస్త్ర చికిత్సల అనంతర పునరావాసంలో ఫిజియోథెరపిస్ట్‌ల సేవలు అమూల్యమన్నారు. వీరి కృషితోనే అనేక మంది సాధారణ జీవితం గడుపుతున్నారన్నారు. వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సహాయం పొందేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ వైద్యులు, విద్యార్థులను సన్మానించారు. ఫిజియోథెరపీ వైద్యులు కూడా ఎమ్మెల్యే నాగరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ఫిజియోథెరపీ వైద్యుల కమిటీ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు